

రహదారిపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో బుధవారం ఈదురగాలులతో కూడిన భారీ వర్షానికి పెదబయలు సమీపంలో ముసిడిపుట్టు-కిత్తుకొండ ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలింది. ఈ సమయంలో సంఘటన స్థలంలో వాహనాలు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. వృక్షం కూలి పోవడంతో పాడేరు, జోలాపుట్టు వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. స్థానికులు, వాహనచోదకులు చెట్టును తొలగించారు.



చెట్టును తొలగిస్తున్న స్థానికులు

మణిపూర్‌లో ఆదివాసీలపై హింసాకాండను నిరసిస్తూ..

నేడు మన్యం బంద్

-జిల్లాలో విస్తృతంగా ప్రచారం- అరకులోయలో బైక్ ర్యాలీ



అరకులోయలో బైక్ ర్యాలీ చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. తీవ్రంగా ఖండిస్తూ.. ఆ రాష్ట్రంలోని బిరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘాలు సంయుక్తంగా ఈనెల 3న గురువారం మన్యం బంద్ చేపట్టనున్నాయి. అల్లూరి జిల్లాలో బంద్‌ను నిర్వహించేందుకు పలు గిరిజన సంఘాలు సమాయత్తమయ్యాయి. ఈ మేరకు జిల్లాలో విస్తృతంగా బుధవారం ప్రచారం చేపట్టాయి

పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఆదివాసి గిరిజన సంఘం గిరిజన సమాఖ్య డిఎల్‌ఓ అనుబంధ సంఘాలు ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్, సిఐటియు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక, సంఘాలు బంద్‌లో పాల్గొననున్నాయి.గత రెండు రోజులుగా జిల్లాలో బంద్ నిర్వహణపై అన్ని వర్గాల ప్రజలకు సమాచారమిచ్చి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని గిరిజన సంఘాలు పిలుపు నిచ్చాయి. బంద్ నిర్వహణపై బుధవారం పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నేతలు ఆర్టీసీ డిపో మేనేజర్, బ్యాంక్ మేనేజర్లు విద్యా సంస్థలు, వర్తక వ్యాపార, వాణిజ్య సంస్థల్ని ప్రత్యేకంగా కలిసి బంద్‌కు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్ సుందర్రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ముచ్చల లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు చిన్నారావు, బొజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో బైక్ ర్యాలీ

అరకులోయ రూరల్: మణిపూర్ ఆదివాసులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాల నిరసిస్తూ చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని అరకువేలిలో ఆదివాసీ గిరిజన సంఘం, దండ కారణ్య విమోచన సమితి, ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, మణిపూర్ 60 వేల మంది ఆదివాసులు పునారవాస కేంద్రాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ లో కుకి, నాగ తెగల ఆదివాసులకు రక్షణ కల్పించాలని, జరుగుతున్న దాడి ఆపాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానం తక్షణమే రద్దు చేయాలన్నారు. దీనిపై గిరిజన ప్రజాప్రతినిదులైన ఎంపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తీర్మానం రద్దు చేసే విధంగా పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న, మండల ఉపాధ్యక్షులు బి.దశరథ, ఉపాధ్యక్షులు కె రామారావు, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర జిల్లా నాయకులు కొర్ర ప్రసన్నకుమార్, జాన్ బాబు, రమేష్ కుమార్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మధు, మార్కండే, అప్పలస్వామి, నిరంజన్, అంజలిరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మన్యం బంద్‌లో ఉద్యోగ, ప్రజా సంఘాలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు బృందాలుగా ఏర్పడి ప్రచారం చేశారు. జెడ్పిటిసి గంగరాజు బృందం అనంతగిరి, ములియగుడ, బొర్రాగుహలు, డమ్ముకు వారపు సంతల్లో ప్రచారం చేశారు. మరో బృందం కాశీపట్నం వారపు సంతతో పాటు శివలింగపురం, కొత్తూరు, చిలకలగెడ్డ ప్రాంతంలో వ్యాపార దుకాణాలు, హెూటల్స్ నిర్వాహకులను కలిశారు. ఆర్టీసీ రవాణా నిలిపివేసి బందుకు సహకరించాలని విజయనగరం జిల్లా ఎస్.కోట ఆర్టీసీ డిపో అధికారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సివేరి. కొండలరావు, మండల కమిటీ నాయకులు ఎం.కృష్ణ, జన్ని.రామన్న తదితరులు పాల్గొన్నారు

సంపూర్ణ మద్దతు

ముంచింగిపుట్టు: 3న చేపట్టే బందుకు అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ, మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం దుర్మార్గమన్నారు. ఆదివాసీల మనుగడను దెబ్బ తీసేందుకు బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తూ వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని, ఆదివాసి హక్కులు చట్టాలు, రిజర్వేషన్ల కాపాడాలని కోరారు.


దుంబ్రిగుడ: మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో యూనియన్ బ్యాంకు, పెట్రోల్ బంక్, కిరాణా దుకాణాల్లో కరపత్రాలు పంచుతూ విస్తతంగా ప్రచారం చేపట్టారు.



బొర్రా గుహలు అధికారికి విజ్ఞప్తి పత్రం అందజేస్తున్న గంగరాజు

అరుకు, కించమండలో కూడా ప్రచారం నిర్వహించి ప్రైవేట్ వాహనదారులు బంద్ కు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్పీ పోతురాజు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు టి సూర్యనారాయణ, పి.సురేష్, పి.సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మహిళలపై జరుగుతున్న హింస కాండను ప్రతిఒక్కరు ఖండించాలని, మన్యం బందు విజయవంతం చేయాలనీ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు టి.కౌసల్య ఆధ్వర్యంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, ఆదివాసీ మహిళలపై రోజు రోజుకు హింసాకాండ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉన్నాయన్నారు.మహిళలను హింసిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



పాడేరులో ఆర్టీసీ డిఎంకు బంద్ లేఖను ఇస్తున్న నాయకులు



నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో ఈఈ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగులు రిలే దీక్షలు మంగళవారం ప్రారంభించారు. ఎడిఇ ఎం.శ్రీనివాస్, ఏఈ బి.రమేష్‌కుమార్, ఏపీ జెన్కో కార్మిక సంఘం నాయకులు శివప్రసాద్, ఎన్.వరప్రసాద్, కె.భాస్కర్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు జె.ప్రసాద్ ఈ దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీలేరు ఏపీ జెన్కో జేఏసీ చైర్మన్ వై.సత్తిబాబు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలపై జెన్కో యాజమాన్యానికి ఇంతకుముందే డిమాండ్లతో కూడిన నోటీసులు అందించామని తెలిపారు. 2022 పిఆర్సి, మూడు డిఏల బకాయి నేటికీ చెల్లించలేదని వాపోయారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంటు అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను జిపిఎఫ్‌గా మార్చి క్యాష్ లెస్ మెడికల్ సదుపాయం కల్పించాలని తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యుత్ జేఏసీతో జెన్కో యాజమాన్యం జరుపుతున్న చర్చల్లో తమ డిమాండ్లను పూర్తిగా అంగీకరిస్తే సంతోషమని, లేకుంటే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగుల దీక్షలకు స్థానిక టిడిపి నాయకులు బొర్రా కృష్ణ, సీలేరు ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లిప్రసాద్, వార్డు మెంబర్ చిటికల రాము సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వై.ధార్రాజు, ఈవీవీ. సత్యనారాయణ, సబ్ ఇంజనీర్లు శ్రీధర్, శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు బి.లక్ష్మణ్, ఆర్.అనీల్, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

దిగువ సీలేరు డొంకరాయిలో..,

సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయిలో మంగళవారం విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి జెన్‌కో ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా విధులు నిర్వహిస్తూ శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు చెప్పారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని కోరారు. డొంకరాయి టిడిపి సీనియర్ నాయకులు కరక రమణ, కార్యకర్తలురిలే నిరాహార దీక్షల శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో...

మోతుగూడెం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మోతుగూడెం ఎపి జెన్‌కో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. యాజమాన్యం తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. తమ సమస్యలను యాజమాన్యం పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని ఉద్యోగులు మండిపడ్డారు.



మోతుగూడెంలో నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు



కంటి అద్దాలను అందజేసున్న జిల్లా ప్రోగ్రాం మేనేజర్

విద్యార్థులకు కంటి పరీక్షలు

1311 మందికి దృష్టిలోపం నిర్ధారణ

జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి-పాడేరు : స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా లో 25,131 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించిగా 1311 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించామని అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దృష్టిలోపం గుర్తించిన విద్యార్థులకు తగిన చికిత్సలు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని జి టిడబ్ల్యుఏ తలారిసింగి స్కూల్‌లో 46 మంది విద్యార్థులకు, లోచలిపుట్టులోని జిటిడబ్ల్యుఏ పాతశాలలో 29 మంది విద్యార్థులకు కంటి అద్దాలు ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి కలక, కంటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



వినతిపత్రం అంజేస్తున్న అప్పలనర్స, నేతలు

పోస్టులను ఆదివాసీలతో భర్తీ చేయాలి

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీ ప్రాంతంలో గురుకుల విద్యా సంస్థలలో పోస్టుల ఖాళీలను ఆదివాసీలతో భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పాడేరు ఐ.టి.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.పాడేరు ఐ.టి.డి.ఏ కార్యాలయంలో పిఒ అభిషేక్‌ను ఆదివాసీ గిరిజన సంఘం ప్రతనిధుల బృందం నేతలు కలిసారు. పాడేరు గిరిజన ప్రాంతాల్లో గురుకుల విద్యా సంస్థలలో ఖాళీలను ఆదివాసీలతో భర్తీ చేయకుండా గిరిజనేతరులతో భర్తీకి ఐ.టి.డి.ఏ ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. జీఓ 3 రద్దుపై సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ విచారణ దశల్లో ఉండగా ప్రభుత్వ ద్వంద వైఖరితో వ్యహరిస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో గిరిజ నేతురులతో భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని, గురుకులం లో జారీ చేసిన నోటిఫికేషన్‌తో స్థానిక ఆదివాసీలలో తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు ప్రవేశానికి అనుమతి లేనిది, ఉద్యోగం పేరుతో నాన్ ట్రైబల్‌ను ఏజెన్సీ ప్రాంతంలో అనుమతించడం దారుణమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని పిఒ తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

ఇళ్లకు చేరిన వరద బాధితులు

- ముమ్మరంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు
- పలు చోట్ల వైద్య శిబిరాలు
- ప్రజాశక్తి కథనాలతో కదిలిన అధికార యంత్రాంగం



బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి-విఆర్.పురం

వర్షాలు తెరిపిచ్చి వరద ప్రవాహం పూర్తిగా తగ్గడంతో పునరావాస కేంద్రాల నుండి బాధితులు తమ ఊళ్లకు చేరారు. మండలంలోని ముంపునకు గురైన శ్రీరామగిరి, జీడిగుప్ప, పోచవరం, ములకనపల్లి, రామవరం, గుర్రంపేట, నూతిగూడెం, కన్నాయిగూడెం కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాల గూడెం, వడ్డిగూడెం కాలనీ, రాజపేట తదితర గ్రామాల ప్రజలు తమ ఇళ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురదను శుభ్రం చేసుకొనే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే అధికార యంత్రాంగం ముమ్మరంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టింది. ఫైర్ ఇంజన్ సహాయంతో బురదను తొలగించి, చెత్తా చెదారం ట్రాక్టర్లతో తీసివేసి బ్లీచింగ్ చల్లారు. పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు పెట్టి ఎఎన్ఎంలు ప్రతి గృహానికి వెళ్లి మందులు అందజేశారు. పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతేడాది వరదల్లో ఇబ్బంది పడ్డా తమను ఎవరూ పట్టించుకోలేదని, ఈ ఏడాది ప్రజాశక్తి కథనాలతో అధికార యంత్రాంగం స్పందించి తమకు సహాయ సహకరాలు అందిస్తున్నారని చెబుతూ, ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలియజేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు, వైద్య శిబిరాలు

విఆర్.పురం : మండలంలోని రామవరం, సోములు గూడెం, విఆర్ పురం వెళ్లే మెయిన్ రోడ్‌లో పారిశుధ్య పనులు ముమ్మరం చేపట్టారు. పంచాయతీ. సర్పంచ్ కారం బుచ్చమ్మ, కార్యదర్శి తాతారావు దగ్గరుండి పారిశుధ్య పనులు చేయించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల గుట్టలపై 15 రోజులు పాటు ఉండటం వలన దోమ కాటుకు గురై డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని, అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



రేఖపల్లిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

దోమల మందు స్ప్రేయింగ్

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వర్యాన బుధవారం రేఖపల్లి మెయిన్ సెంటర్, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ సహాయం

కూనవరం : మండలంలోని ముంపు గురైన టేకులబోరు, కూనవరం గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. బోదునూరు బేస్ క్యాంపు వద్ద అడవిలో కొండ మంది గుడారాలు వేసుకున్నారు. వరద తగ్గడంతో వారి గ్రామాలకు పయనం కాగా, అక్కడున్న 60 కుటుంబాలను తరలించేందుకు స్థానిక ఎస్ఐ వెంకటేష్ తనవంతు సాయం అందించారు. ట్రాక్టర్లు ఏర్పాటు చేసి వారిని గ్రామాలకు తరలించారు. ఎస్ఐ, పోలీసు సిబ్బందికి బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

మండల కేంద్రంలో జనం కళ..

చింతూరు : భారీ వర్షాలు, వరదలతో జలదిగ్బంధంలో చిక్కుకొని తల్లడిల్లిన గిరిజన గ్రామాలు వరద తగ్గడంతో తేరుకున్నాయి. నిత్యవసరాలు అందక ఇబ్బందులు పడ్డ పల్లె ప్రజలు, రెండు వారాల పాటు మండల కేంద్రానికి రహదారులు లేక అల్లాడిన ప్రజలు, బుధవారం చింతూరు మండల కేంద్రంలో సంతకు జనం పెద్ద సంఖ్యలో వచ్చారు. కూరగాయలు, నిత్యావసరాలు కొనుగోలు చేశారు. కిరాణా షాపులు, కూరగాయల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. స్థానిక బ్యాంకుల వద్ద జనాలు బారులు తీరారు. వరద వ్యర్థాలను చింతూరు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. అయితే పంచాయతీ జనాభాకు తగ్గట్టూ కార్మికులు లేకపోవడంతో వారిపైనే భారం పడుతుంది.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



మోకాళ్ల లోతు బురదలో నిత్యావసర సరుకులు తెస్తున్న సర్పంచ్, సిపిఎం కార్యకర్తలు

మోకాళ్లోతు బురదలో నిత్యావసరాలు తరలింపు

ప్రజాశక్తి-విఆర్.పురం

శ్రీరామగిరి పంచాయితీ పరిధి కల్తునూరు గ్రామానికి నిత్యావసర సరుకులను ఆ పంచాయతీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్ అధికారులతో మాట్లాడి పడవ మీద తీసుకొచ్చారు. అక్కడ నుండి మోకాళ్ల లోతు బురదలో మోసుకుంటూ ఒడ్డుపైకి ఎక్కి కల్తునూరుకు తరలించారు. గ్రామ ప్రజలకు నిత్యవసర సరుకులు, నూనె ప్యాకెట్లు, పాలు, కొవ్వొత్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తాము ఎన్నుకున్న నాయకుడు సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తమకు ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారానికి ముందుంటున్నారని తెలిపారు. గ్రామ ప్రజలు సర్పంచ్‌కు, సిపిఎం బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్లకు నష్ట పరిహారం ఇవ్వాలి : సర్పంచ్

ఈ సందర్భంగా శ్రీరామగిరి సర్పంచ్, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇళ్ళన్నీ పూర్తిగా మునిగి కూలిపోయిన పరిస్థితి గ్రామంలో ఉందని, అర్ధాకలితో ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కనీసం కిరోషిన్ కూడా ఇవ్వలేదన్నారు. గతేడాదిలో వరదలు వచ్చి తీవ్ర నష్టాన్ని కలిగిస్తే ప్రభుత్వం రూ.2000 ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈ సారైనా కళ్ళు తెరిచి ఇళ్లు నీటమునిగి తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు రూ.50 వేలు నుండి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మాజీ సర్పంచ్ పులి ధర్మరాజు, మాజీ ఉపసర్పంచ్ గుండిపూడి లక్ష్మణ్ రావు, ఆత్మకూరి కాంతారావు, నాళ్లారపు చంద్రావు, కన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

విఆర్.పురం : మండలంలో ముంపు ప్రాంతాల్లో ప్రజలు వరదలు పూర్తిగా తగ్గడంతో తమ ఇళ్లకు వచ్చారు. అయితే కొండ గుట్టలపై, అడవిలో గుడారల్లేసుకొని ఉన్నామని, దోమకాటుల వలన జ్వరాలతో పాటు సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయని, వైద్య శిబిరాలు నిర్వహించాలని వరద బాధితులు కోరుతున్నారు. వరద గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

హింస లేని సమాజం కోసం చేయి చేయి కలుపుదాం

మహిళల పోరుయాత్రలో ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ



పోరుయాత్ర సభలో పద్మ, ప్రభావతి, తదితరులు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: హింసలేని సమాజం కోసం అందరూ చేయి చేయి కలపాలని ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ.పద్మ పిలుపునిచ్చారు. మహిళలపై హింసను అరికట్టాలంటూ ఐద్వా ఆధ్వర్యాన చేపట్టిన పోరుయాత్ర బుధవారం అల్లూరి జిల్లాలోని రంపచోడవరం మండలంలోకి ప్రవేశించింది. ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాలలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి హయాంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. రోజురోజుకూ హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, వేధింపులు నిరోధించేందుకు అంతరంగిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలన్నారు. రంపచోడవరంలో గతేడాది ఓ హాస్టల్ అమ్మాయి హత్యకు గురైతే బయటకు పొక్కనీయకుండా చేశారని తెలిపారు. కరకవాడలో హాస్టల్ వార్డెన్ భర్త విద్యార్థిలను వేధించిన విషయాన్ని గుర్తుచేశారు. మద్యపానానికి అలవాటుపడి యువత చెడుమార్గం పడుతున్నారన్నారు. ఇటీవల రాష్ట్రంలో నేరపూరిత కేసులు పెరిగాయని తెలిపారు. మహిళలు అదృశ్యమవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మహిళ పట్ల హింసను విడనాడాలని పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా జాతా నిర్వహిస్తోందని అన్నారు. ఈ నెల 8న విజయవాడలో భారీ సభ ఉంటుందని, వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, నాయకులు సిహెచ్.రమణి, సత్యవతి, కుంజా రాధ, పూర్ణిమ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.వాణిశ్రీ పాల్గొన్నారు.

8న పోరుయాత్ర బహిరంగ సభ

- జయప్రదం చేయాలని నేతల పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐద్వానేతలు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ : మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళా పోరుయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 8న విజయవాడలో నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వి విజయ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో మహిళా సంఘం నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వి.విజయ మాట్లాడుతూ గతనెల 28 నుండి ఆగస్ట్ 3 వరకు పోరుయాత్ర ద్వారా మహిళలపై. జరుగుతున్న హింసపై ప్రజలకు చైతన్య పరుస్తున్నామన్నారు. మణిపూర్ మారణహోమంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నోరు విప్పకపోవడాన్ని ఖండించారు. మణిపూర్ మానవమృగాలకు ఉరిశిక్ష వేయాలని, అక్కడ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నేత పి కుమారి పాల్గొన్నారు.

విఒఎల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న విఒఎలు

ప్రజాశక్తి – చింతూరు :వి.ఒ.ఎల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వి.ఒ.ఎలు బుధవారం వెలుగు ఏపీఎం మజ్జి నాయుడుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి వి.ఒ.ఎలు పనిచేస్తున్న వారికి పెండింగ్ వేతనాలు ఇంతవరకు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. మండల వ్యాప్తంగా 51 మంది వి.ఒ.ఎలు ఉన్నారని, కొంతమందికి 2022 మార్చి నుండి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇలా అయితే వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే 51 మందితో ఈ నెల 20 నుండి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, వివోఏ గౌరి లక్ష్మయ్య, రత్నకుమారి, లీలావతి, భూచిరాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త నిరసనలు



మాట్లాడుతున్న కుంజా అనిల్

ప్రజాశక్తి-చింతూరు : ఏకరూప పౌరస్మృతి (యుసిసి), మణిపూర్ హింస, అటవీ సంరక్షణ చట్ట సవరణలు వంటివి దేశ ఆదివాసీల ఉనికిని దెబ్బతీసేవిగా ఉన్నాయని, వీటిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపి ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ తెలిపారు. చింతూరులో బుధవారం జరిగిన ఆదివాసీ జేఏసీ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసను నివారించి తక్షణం శాంతిని నెలకొల్పాలని కోరారు. దేశంలో అత్యంత వెనుకబడి ఉన్న ఆదిమజాతి తెగలను ఏకరూప పౌరస్మృతి పరిధిలోకి తెస్తే ఆయా జన సమూహాల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంరక్షణ చట్ట సవరణ ద్వారా తరతరాలుగా తమకు జీవనాన్ని ఇస్తున్న అడవులను కోల్పోవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ డివిజన్ నాయకులు పాయం లక్ష్మణ్‌రావు, వెలగాని మల్లయ్య, రవి, మడివి రాజు, సురేష్, పూనెం వేణుగోపాల్, ప్రవీణ్, అశోక్, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు కంటే అధ్వానం

- కాకునూరులో సిసి రోడ్డు దుస్థితి
- వర్షమొస్తే రాకపోకలకు ఇక్కట్లు



బురదమయంగా తయారైన కాకునూరు సిసి రోడ్డు

ప్రజాశక్తి -సీలేరు : జీకే.వీధి మండలం గుమ్మిరేవులు పంచాయతీ కాకునూరులో సిసి రహదారి మట్టి రోడ్డు కంటే అధ్వానంగా తయారైంది. ఇటీవల15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రహదారిలో అడుగు తీసి అడుగు వేయలేనంతగా బురద పేరుకుపోవడంతో జనాలు చాలా ఇబ్బందులకు గురౌతున్నారు.

సిసి రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటం, ఇరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరంగా సిసి రోడ్డుపై నుండి పారింది. దీంతో పెద్ద మొత్తంలో బురద పేరుకుపోయింది. వేసిన కాలు మళ్లీ తీయలేనంతగా బురద పేరుకుపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ద్విచక్రవాహనాలు ఈ రోడ్డుపై వెళ్లాలని ప్రయత్నిస్తే, స్కిడ్ అయి కాళ్లుచేతులు విరగ్గొట్టుకోవడం ఖాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాలకు వెళ్లాలనుకునే వారు ధారకొండ వెళ్లాలంటే ఈ రోడ్డుమీదుగా వెళ్లాల్సిన స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. ఇక అత్యవసరమైతే అంబులెన్స్ రాలేని పరిస్థితి ఉండడంతో ఎలాగని స్థానికులు కలవరం చెందుతున్నారు. వర్షాల సీజన్‌లో ఈ సిసిరోడ్డుమీదుగా నడవాలంటే, దీనికి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించడమొక్కటే మార్గమని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కాకునూరు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

'సంపూర్ణ పోషణ'ను సద్వినియోగం చేసుకోండి



పాడేరులో కిట్లను పంపిణీ చేస్తున్న పిఒ అభిషేక్



హుకుంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి -పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 50మందికి సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న బాలింతలు, గర్భిణులు ప్రతిరోజూ వచ్చి పోషకాహారం తీసుకోవాలంటే పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారుల ఇంటికే పోషకాహారాన్ని అందజేస్తారన్నారు. గిరిజన ప్రాంతంలో లబ్ధిదారులకు ఈవిధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇటీవల 400 అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశామన్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో ఐసిడిఎస్ సేవలు, పోషకాహారం పంపిణీపై లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించినపుడు దీనిపై లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటా నన్నారు. ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి పాలవిశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. సంపూర్ణ పోషణ కిట్‌లో పాలు, గుడ్లు, బెల్లం, చిక్కీలు, ఖర్జూరం, బియ్యం, పప్పులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాడేరు సిడిపిఒ పి.ఝాన్సీరాణి, డాక్టర్ జి. తనూజా రాణి, సూపరింటెండెంట్ రామచంద్రమూర్తి, డిపిహెచ్ ఎన్ఒ భూలోకమ్మ, పలువురు సూపర్‌వైజర్లు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

హుకుంపేట: రక్తహీనత నివారించి ఆరోగ్యకరమైన బిడ్డలు జన్మనివ్వాలని అరుకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు.స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో టేక్ హోం రేషన్ పంపిణీ కింద సంపూర్ణ పోషణ కిట్లను 30మంది గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. స్త్రీశిశుసంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ, మాతా, శిశు మరణాలరేటును తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సిడిపిఒ సిహెచ్ బాలామణిదేవి తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఇంటింటికీ పోషణ సరుకులు పంపిణీ చేసి, మొబైల్ యాప్‌లో ఆ ఫోటో అప్‌లోడ్ చేయాలని అంగన్వాడీలకు సూచిస్తూ, దానిపై అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజబాబు, జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, ఎంపిడిఒ ఆర్ వెంకట రమణ, వెలుగు ఎపిఎం చిన్నారావు పాల్గొన్నారు.

అనంతగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిపిడిఒ సంతోషికుమారి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణపోషణ కిట్లను లబ్ధిదారులైన గర్భిణులు,బాలింతలకు ఎంపిపి శెట్టి నీలవేణి, జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రారంభించారు. తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్. రాంబాయి, అడిషనల్ సిడిపిఒ అచ్యుత, ఎటిడబ్ల్యుఒ వెంకటరమణ, ఎంఇఒ బాలాజీ, మాన్సీ ప్రాజెక్ట్ ప్రతినిధి సంపత్, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ మాట్లాడుతూ, ఈ పథకంతో గర్భిణలకు ఇంటి వద్దకే పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఎస్ ఆనంద్, పి లలిత, ఎంపిటిసి ఎంగీత, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి :స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపిపి సార్ల లలిత కుమారి జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభిచారు. జెడ్‌పిటిసి గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపిపి లక్కొండ రవికుమార్, సర్పంచ్ కొండా జాకబ్, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు పాల్గొని, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసారు. కార్యక్రమంలో సిడిపిఒ ప్రసన్న విశ్వనాథన్. సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రవళి, సీత పాల్గొన్నారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు



మారేడుమిల్లిలో కిట్లు పంపిణీ చేస్తున్న నేతలు

గిరిజనేతర నిర్వాసితుల సమస్యలపై వినతి



సిపిఎం ఆధ్వర్యాన పిఒకు వినతిపత్రం ఇస్తున్న గిరిజనేతర నిర్వాసితులు

ప్రజాశక్తి-విఆర్ పురం: గిరిజనేతర నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చింతూరు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేను కలిసి సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో బాధితులు విన్నవించారు. గిరిజనేతరులకు తాడ్వాయిలో కాకుండా వారు కోరుకున్న చోట పూర్తి సౌకర్యాలతో పునరావాసం కల్పించాలని, ప్రతి కుటుంబానికి రూ.15లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఏటా రీనోటిఫికేషన్ విడుదల చేసి ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, పోలవరం ప్రాజెక్టు, దాని అనుబంధ ప్రాజెక్టులలో నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగావకాశాలను కల్పించాలని, కోరుకున్న వారికి వన్‌టైం సెటిల్మెంట్ కింద రూ.30లక్షలు పరిహారం చెల్లించాలని,2022 ఎన్ఆర్ రేట్లు ప్రకారం ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై పిఒ స్పందిస్తూ, ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గూటాల శ్రీనివాసరావు, మాదిరెడ్డి శ్రీను, చందర్రావు, టిడిపి నాయకులు ముత్యాల చంద్రశేఖర్, శంకరరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేతకు అధికారుల ఆదేశం



మాట్లాడుతున్న సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని అతిక్రమించి అక్రమ నిర్మాణం చేసిన మొగలిపూరి రాధాకృష్ణ భవనాన్ని కూల్చేయాలని పాడేరు ఎస్‌డిసి ఆదేశించారనిఆదివాసీ గిరిజన సంఘం మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలో సర్వే నంబర్ 10/1బి ,11/2బి 11/1బి స్థలంలో గిరిజనేతరుడైన బట్టల వ్యాపారి మొగలిపూరి రాధాకృష్ణ 2021లో అక్రమంగా ఇల్లు, పాన్ షాప్ నిర్మించుకొన్నారన్నారు. దీనిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని అప్పటి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో పాడేరు ఆర్‌డిఒకు ఫిర్యాదు చేయగా, రెండుసార్లు వాయిదా అనంతరం ఇరువైపులా వాదనలు విన్న ఆర్‌డిఒ, అక్రమ నిర్మాణంగా నిర్ధారించి, కూల్చివేతకు స్థానిక తహశీల్దార్‌కు ఆదేశించారని సన్నిబాబు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి, లా ఫోరమ్ అధ్యక్షులు, జెఎసి మండల కన్వీనర్ కిమంకరి బొంజుబాబు పాల్గొన్నారు

ఎస్ఐ రామకృష్ణ ఔదార్యం



ప్రమాద మృతుని కుటుంబానికి నిత్యావసరాలు ఇస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి -సీలేరు: ప్రమాదంలో మృతి చెందిన గంజాయి నిందితుడి కుటుంబానికి నిత్యావసరాలను అందజేసి, స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఉదారతను చాటుకున్నారు. జీకేవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి గ్రామానికి చెందిన మజ్జి జగదీష్ గంజాయి కేసులో వాయిదాకు ఖమ్మం వెళ్లి, తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా, గత నెల 26 అర్ధరాత్రి పాల్వంచ వద్ద ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొట్టి ప్రమాదానికి గురై సంఘటనాస్థలిలోనే మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం పరామర్శించిన ఎస్ఐ రామకృష్ణ, ఇతర పోలీసులు, వారికి నిత్యావసరాలు, ఆర్థికసాయం అందజేశారు.

వరద బాధితులకు 'రెడ్‌క్రాస్' కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, పిఒ

ప్రజాశక్తి- పాడేరు : చింతూరు ఐటిడిఎ పరిధిలోని గోదావరి వరదముంపు ప్రాంతాల్లో బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దోమతెరలు, టార్పాలిన్లు కిట్లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎ శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ పరిడ ముంపు బాధితులకు అందజేసిన కిట్లను, బుధవారం సాయంత్రం కూనవరంలో ఉదయభాస్కర్ కాలనీ బాధితులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటిడిఎ పిఒ సూరజ్‌గనేరో అందజేశారు. కోతులగుట్టలో పునరావాసం ఉంటున్న బాధితులకు దోమతెరలు, హైజిన్ కిట్లు, టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల కోఆర్డినేటర్ లోహితాస్, మేనేజింగ్ కమిటీ మెంబర్ సూర్యారావు, అనకాపల్లి కోఆర్డినేటర్ యన్. కోటేశ్వరరావు, సాంబ, ఎం భాస్కరాచారి, కృపాకర్, సీతారాం, చింతూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, విద్యార్థి బృందం పాల్గొంది.

నేరాలు ఘోరాలు

180 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

ప్రజాశక్తి -పెదబయలు :మండలంలో సీతగుంట జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.2.70లక్షల విలువైన 180కిలోల గంజాయి పట్టుబడింది. ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.

ముందస్తు సమాచారం మేరకు సీతగుంట జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా, కుమడ నుంచి సీతగుంట జంక్షన్ వైపు వస్తున్న మహేంద్ర బొలెరో వాహనాన్ని ఆపగా, అందులోనినలుగురు వ్యక్తులు పారిపోతుండగా, పోలీసులు వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా ఆరు బస్తాల్లో 180కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయితోపాటు వాహనాన్ని పట్టుకున్న నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరు ఒడిశా కొరాపుట్ జిల్లా పొట్టంగి, గట్టిగుడకు చెందిన రాజేంద్ర కర్ర కాగా, మరో నిందితుడు పెదబయలు మండలం దొండగరువుకు చెందిన వంతాల అప్పారావుగా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని, పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం

-మృతదేహంతో కుటుంబీకులు, బంధువుల ఆందోళన



ప్రమాద స్థలంలో లారీ, ఆటో

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. హుకుంపేట నుంచి నిమ్మలపాడు వెళ్తున్న ఆటోను కోట్నపల్లి క్వారీ నుంచి పాడేరు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ రేగం నారాయణరాజు (32) అక్కడికక్కడే మృతి చెందాడని.ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.తాడేపుట్టు పంచాయతీ నిమ్మలపాడుకు చెందిన నారాయణరాజు రోజూ మాదిరిగానే తన ఆటోలో స్కూల్ పిల్లలను దిగబెడుతూ, తర్వాత ఆటోను అద్దెకు తిప్పుతుంటాడు.మంగళవారం రాత్రి ఇంటికి బయలుదేరే క్రమంలో ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్, లారీలో ఉన్నవారు పరారయ్యారు. గడుగుపల్లి గ్రామస్తులకు పెద్ద శబ్దాలు వినిపించడం సంఘటన స్థలానికి చేరుకున్నారు.వెంటనే ఆటో డ్రైవర్‌ను గుర్తించి, వారి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న మృతుని భార్య పిల్లలు బంధువుల ఆర్తనాదాలతో పరిసరాలు ఉద్విగ్నంగా మారాయి. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

కాగా ప్రమాదానికి క్వారీ లారీయే కారణం కావడంతో బాధిత కుటుంబానికి క్వారీ యజమాని రూ.ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంఘటనస్థలిలో బాధిత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు.

కొండను ఢీకొన్న కూరగాయల వ్యాన్

- నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

ప్రజాశక్తి -అనంతగిరి : అనంతగిరి ఘాట్‌రోడ్డులో రోజురోజుకు వాహనాల ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. సోమవారం తౌడుతో వెళ్తున్న లారీ లోయలోకి దూసుకెళ్లగా, బుధవారం కూరగాయల వ్యాన్ కొండను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అరకు నుండి విశాఖపట్నం రైతుబజార్‌కు అల్లం, పనసకాయల లోడుతో వెళుతున్న వ్యాన్ బుధవారం సాయంత్రం టైడా జంగిల్ బెల్స్ సమీపంలో బ్రేక్ ఫెయిలై మలుపు వద్ద కొండను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో సహ ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు వీరికి ఇద్దరికీ తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత అదృశ్యంపై కేసు



అదృశ్యమైన వివాహిత వరలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి గ్రామానికి చెందిన వరలక్ష్మి(23) అనే వివాహిత ఈనెల ఒకటిన ఇంటి నుండి వెళ్లి అదృశ్యమైనట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్ఐ జాన్‌కుమార్ బుధవారం తెలిపారు. లోదొడ్డి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, భార్య వరలక్ష్మి 99 బిల్డింగుల సమీపంలో నివాసముంటున్నారు. ఈ నెల ఒకటిన ఉదయం 5గంటలకు వరలక్ష్మి తన కుమార్తె తనుశ్రీని తీసుకొని జగ్గంపేట వెళ్లి వస్తానని చెప్పిల వెళ్లిందని, ఇంతవరకు ఇంటికి రాలేదని ఆమె భర్త చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ జాన్ కుమార్ తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



ఏడుగుర్రాలపల్లిలో వెలసిన పోస్టర్లు

ప్రజాశక్తి- చింతూరు : 28నుంచి ఈనెల 3వ తేదీ వరకు మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో, బుధవారం మండలంలోని ఏడుగుర్రాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, బొడ్డుగూడెం, సరివెల, చింతూరు టీ టైం వద్ద, జాతీయ రహదారి ప్రక్కన ఉన్న బోర్డుల మీద మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు ప్రత్యేక్షమయ్యాయి. అల్లూరి జిల్లా ఆదివాసీ యువజన సంఘం పేరిట వెలసిన ఈ పోస్టర్లలో 'గిరిజనులకు ఉపయోగం లేని వారోత్సవాలు వద్దు, అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారు, ఆర్‌టిసి బస్సులను దగ్ధం చేసి రవాణా సౌకర్యం లేకుండా చేస్తున్నారు, రహదారులు వేస్తున్న యంత్రాలను కాల్చడం, విద్యుత్ సబ్ స్టేషన్‌లను పేల్చడం వంటి చర్యల ద్వారా మన్యవాసులను అభివృద్ధికి దూరంగా బతకమంటున్నారు, అందుకే వారోత్సవాలు వద్దు అంటూ వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు. మావోయిస్టులారా మీరు ఎక్కడ ఉంటే అక్కడ వినాశనం విధ్వంసమే అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు.